# ఆశాభంగము

గాలి బాలసుందరరావుగారు.

అనురాగం, అజ్ఞానం, అమాయికత్వం మూడూకలిపి ముద్దచేసి సృష్టించాడు బ్రహ్మదేవుడు సావిత్రిని. నిరంతర సాంఘిక విప్లవభావ సంచలితుడైన ప్రభాకరరావుకు భార్యనిచేశాడు, భాగ్యవశాన్నో, దౌర్భాగ్యవశాన్నో!

సావిత్రితండ్రి సక్రమాక్రమ సంపాదనలతో పది డబ్బులు కూడ బెట్టుకున్న ప్రభుత్వోద్యోగి. స్త్రీ ప్రపంచకం సరిహద్దులు, ఈన్నయింటి ప్రహారీ గోడలేననీ, ఆడవాళ్లకు అక్షరాల్తోగూడా నిమిత్తంలేదనీ తనకు దృఢమైన విశ్వాసంఉన్నా నాగరికత మారిపోతున్న యీరోజుల్లో ప్రతిపెళ్లికొడుకూ అడిగే ప్రశ్నల్లో "మీఅమ్మాయి యేంచదువుతోంది" అనేది ప్రధానం అయింది—అవటంచేత విధిలేక కూతుర్ని బళ్ళోకిపంపక తప్పిందికాదు. జన్మతః మందబుద్ధి, చదివేవా అని అడిగేవాళ్లు లేకపోవటం, సంవత్సరానికి మూడుమాట్లు బదిలీ అయ్యేవాళ్ల నాన్న ఉద్యోగం, అన్నీకలిపి ఆ అమ్మాయిని అయిదో క్లాసు దాటనీయలేదు. సావిత్రికి పదకొండోయేడు రావటంతోటే ప్రసాదరావుగారు అపంచకాన్ని గాలించి ప్రభాకరరావు సంబంధంమాట తెలుసుకుని, తల్లిదండ్రులులేని అతనికి సంరక్షకుడై, పెంచిపెద్దచేసి చదువు చెప్పించుతున్న అతనిపినతల్లి భర్తతో మాట్లాడి సరే ననిపించుకుని పట్నంలో చదువుతున్న అతనికి ఉత్తరం రాయించాడు.

సాయంత్రం టీచికి షికారువెళ్లి హోష్టలుకువచ్చి గదితలుపు తెరిచేటప్పటికి పినతండ్రిదగ్గరనుంచి వచ్చిన ఉత్తరం కనపడింది. అందులో సారాంశం, ఆరాత్రి మెయిల్లోనే బయల్దేరి రావలసిందని. ఏం మునిగిందో నని తొందరగా భోజనాదికములచేసుకుని అతను మెయిలెక్కాడు. మర్నాడు ప్రొద్దున్నకు బెజవాడ వెళ్లేడు.

ఇంట్లో వాళ్లపినతండ్రి సంబంధంసంగతి అంతా చెప్పి "అంతా నిశ్చయం అయింది; నువ్వు పిల్లని చూట్టమే తరవాయి" అన్నాడు. "అంతా నిశ్చయం అయ్యాక నేను చూడకపోతే మట్టుకేం" అన్నాడు ప్రభాకరరావు. తెలుగుకుటుంబాల్లో అటువంటి పరిస్థితుల్లో సంభవించేవాదనలు చివాట్లు బెదరింపులు అన్నీ అయినవి. ఆదర్శంకోసం అభ్యుదయం త్యాగం చేయలేని అనేకమందిలాగ అతనూ లొంగిపోయినాడు. అమాయికఅయినసావిత్రి అనేదో నెపడవ తీవ్రభావతరంగ సంక్షోభితమైన అతని జీవితసముద్రంలోకి కొట్టుకువచ్చింది.

ప్రభాకరరావు అవతరించిన రసజ్ఞత; స్వరూపం ధరించిన సాంఘికవిప్లవం. విద్యాపూర్తి అయింతరవాత తనంతటదై, విద్యావతి, ప్రతిభావతి, సౌందర్యవతి, అయిన యువతిని జీవిత భాగస్వామినిగా చేసుకుని తన అభిప్రాయములన్నీ అమల్లో పెట్టదలుచుకున్న అతని ఆశాసౌధము చీట్లపేక మేడలాగ కూలిపోయింది. అతని అభిప్రాయాల్లో ఎంత విప్లవస్వభావం వుందో అంత ద్రఢిమ అతని హృదయానికిలేదు. ఆ స్థైర్యరాహిత్యమే అతన్ని వంచించింది.

అతను వైద్యకళాశాలలో చేరటానికి పట్నం వెళ్లే నాడే రైల్లో సుధార్ణవకీ అతనికీ పరిచయం అయింది. వాంఛ్మయంలో అభిరుచివున్న యువతీయువకుల స్నేహం అభివృద్ధి చెందినట్లుగా మరేదీ అభివృద్ధి చెందలేదు. సుధార్ణవకూడా వైద్యవిద్యార్థిని. అప్ర

యత్నంగా ఆరంభించిన వారిపరిచయం నిత్యపరిచయంవల్లా స్వభావైక్యంవల్లా త్వరలోనే స్నేహమై చివరకు పరస్పరమైన అనురాగంగా మారిపోయింది. కాని ఆ అనురాగములు కేవలం మానసికములు. బాహిరంగా వాటి సంబంధం స్వచ్ఛమైన సౌహార్ద్యం.

ఏకోద్రేక ప్రకంపితములై వారిహృదయ వీణెల భావతంతువులు దివ్యగానంచేస్తూ తన్మయత్వంచెందుతూవుంటే తప్పతాళంవేసి భగవంతుడు గానభంగం చేశాడు. నవ్యనాగరికతా సంజనితమైన స్వేచ్ఛావాతావరణంలో సాధారణదృష్టికి అతీతమైనస్థితికి ఎదిగనీ స్నేహవిమానమ్మీద వారిఆత్మలు ప్రేమ విహారం చేస్తూవుంటే ఆవిమానం రెక్కవిరిగింది.

వారు తమ ప్రేమలను పరస్పరం ఎరుకగించుకోనైనాలేదు. దర్పణంలో వారిరువురూ సమానులే. ప్రభాకరరావు బయటబడితే కాస్సేపు ఆడించి సరేనందామని సుధార్ణవపూహ. ఆవిడ హృదయకవాటంవిప్పి ఆహ్వానించితే లోపలికి వెళదామని అతని అభిలాష. ఈవిధంగా వారి విజ్ఞానపరిశోభితములైన హృదయములు ఒకదానికి ఒకటిలాంగకే దివ్యనృత్యం చేస్తూవుంటే ఒకరికి కాలు బెణికింది.

చేసినతప్పు నిస్సంకోచంగా ఒప్పుకోలేని హృదయదౌర్బల్యమో, సిగ్గో, భయమో ఆవిడహృదయాన్ని వికలం చేయటానికి అయిష్టమో, మరేదో అతన్ని ఆవేసించి తన వివాహంవిషయమై సుధార్ణవకు తెలియజేయనీయలేదు. ఆవిడదృష్టిలో అతనింకా అవివాహితుడే! అతనిహృదయం యింకా అనన్యదత్తమే! తనప్రేమని సార్థకం చేసుకుంటానికి కావలసినంత వ్యవధివుంది.

తన దౌర్బల్యంచేతనే తన జీవితంలోకి తీసుకురాబడిన అమాయికవ్యక్తికి తనప్రేమని యీయలేకపోయినా గౌరవాన్నయినాయిచ్చి భర్తగా తనవిధిని కొంతవరకు నిర్వర్తించుదామనుకున్నాడు ప్రభాకరరావు. అనేకమార్లు ఆవిడని హైస్కూలుకు పంపించమని మామగారికి ఉత్తరంరాశాడు. "ఆడదానికి చదువు అవసరంలే"దని ఒకమారూ, 'ప్రైవేటు మేష్టర్ని పెట్టే'నని ఒకమారూ, హార్మోనియం కొన్నానని ఒకమారూ, 'అంతగా చదువురావాలనివుంటే నువ్వే తీసుకవెళ్లవచ్చు'నని ఒకమారూ జవాబులు వచ్చినయి. ఆవుత్తరాలన్నీ చూస్తువుంటే ఆగ్రహం యేడుపూ రెండూ వచ్చేవి అతనికి.

రోజులుగడిచినయి. సావిత్రిశారీరికంగా పరిపక్వం అయింది. తనదగ్గిరేవుంచుకుని తన హృదయావస్థను అవగాహనం చేసుకుండేపాటి విజ్ఞానం కలిగించితే తరవాత చూడవచ్చునని చెన్నపట్టణం తీసుకువెళ్లేడు ప్రభాకరరావు. వారిద్దరూ మాంబళంలో ఒక చిన్న గది అద్దెకుతీసుకుని 'కాపురం' వున్నారు. చాలా రోజులు బంజరుగావున్న యీచవిటి పొరలో దొరువు తోలి మెరకపల్లములు సరిచేసి దున్ని విజ్ఞానబీజములు వేసిచూడాలి. ఫలించితే ఫలించుతుంది. కాకపోతే పొలంసంగతి దొరక్కుండానే శాశ్వతకవులురాసి యిచ్చిన రైతులాగా అవుతుంది అతనిపని.

అతను నాలుగోసంవత్సరంలోకివచ్చేడు. సుధార్ణవా అతనితోనే అంగలువేసింది. ఇంకా ఆవిడ దృష్టిలో ప్రభాకరరావు అవివాహితుడే. తన మనోరథం సఫలీకృతం చేసుకుంటానికి యింకా చాలా కాలంవుంది. ఆవిడ ప్రణయలత రోజూ ఒకకొన తగిలిస్తోంది. దాన్ని నిర్మూలించటానికి ప్రపంచకంలో ఉన్న గొడ్డళ్లన్నీ పనిచేసినాచాలవు.

సుధార్ణవవిషయంలో తను మహాద్రోహం చేస్తున్నానన అది అక్షంతవ్యమూ అధమమూ అయిన పాతకమనీ, ప్రభాకరరావు తనలో తనే బాధపడేవాడు. చాలామాట్లు చెప్పేద్దామనుకుండేవాడు. కాని చెప్పటానికి ఏం అవకాశం ఉంది? చెప్పేవాడు మొదటే "నాపెళ్లి" అని చెప్పాలి: కాకపోతే మళ్లీ ఆప్రస్తావన వచ్చినప్పుడు చెప్పాలి. ఇప్పుడు అసందర్భంగా "నాపెళ్లి అయిపోయిందోయి"



351

అని యెల్లాగా చెప్పటం? చెప్పితే ఆవిడ సంతోష విచ్ఛిత్తితప్ప ప్రయోజనం యేమీవుండదు. ఆశావాయు తరంగాల్లో అల్లల్లాడుతూ, అనురాగ మేఘాల్లోకి యెగసి ఆనందంకలిగించే ఆవిడప్రేమఅనే గాలిపటం దారాన్ని కత్తిరించటం అతనికి యిష్టంలేదు. కాలక్రమాన్నే యీరహస్యప్రణయాగ్ని పర్వతం బ్రద్దలవుతుంది.

ii

సావిత్రిని కార్పొరేషన్ స్కూల్లో చేర్పిద్దామనుకున్నాడు మొదట. కాని ఆవిడ చచ్చినా బళ్ళోకి వెళ్ళనన్నది. పోనీ యింట్లోనే విద్యలోకొంత అభిరుచి కలిగించితే కొంతలాభించుతుం దనుకున్నాడు.

ఆవిడ విద్యకోసం అతను అవలంబించినన్ని విద్యావిధానాలు ఏట్రెయినింగు కాలేజీప్రొఫెసరు అవలంబించి వుండడు.

ఆదర్శప్రాయమైనభార్యకు ఉండవలసిన లక్షణాలనుగురించి అతనికి చాలావింత అభిప్రాయాలున్నవి.

భౌతిక సౌందర్యంతో అతనికి అట్టేపట్టింపులేదు. కురూపి కాకుండావుంటేచాలు. స్త్రీకి సౌందర్యం అంటే విజ్ఞానసౌందర్యమే నని అతనివుద్దేశం.

తనకు భార్యగావుండి తనగౌరవమును పొందాలంటే తెలుగులో తన కవిత్వాన్ని అర్థంచేసుకుని ఆనందించే విమర్శాపాండిత్యం వుండాలి. ద్వంద్వార్థాల్తో వ్యంగ్యార్థములతో తనతో యింగ్లీషు మాట్లాడగలిగివుండాలి. మర్యాదకులోబడి మాటకుమాటా వేటుకువేటూ వెయ్యాలి.

జీవప్రకృతి రసాయనశాస్త్రాల్లో అత్యంతాధునిక సిద్ధాంతాల్నిగూడా అర్థంచేసుకుని వాటిని నిత్యజీవిత విధానానికి అనువర్తించి జాతీయజీవితంలో పెద్ద విప్లవం తీసుకురావాలి. ఆచారపిశాచాన్ని రూపుమాపి యింట్లో చిన్నస్వర్గమును సృష్టించాలి. శాస్త్రదృష్టితో నవీన సమస్యలనుగ్రహించి తనతోచర్చించి మార్గాలు సూచించాలి.

ఊహాతీతములైన భావవీథుల్లో తనతోపాటు పోటీపడి విహరించాలి. రమ్యమైన ఒకచిత్రాన్నో, దృశ్యాన్నో, గీతాన్నో చూపించితే ఆసౌందర్యాన్ని తనతోపాటు అనుభవించేశక్తి గలిగివుండాలి.

ఈక్షణం పార్శీలాగా, యింకోక్షణం బెంగాలీలాగా, మరోక్షణం పంజాబీలాగా వేషం మారుస్తూ నూత్నాలంకరణవిధానాల్లో రిసెర్చిచేస్తూ రసదేవత అనిపించాలి. తనుతెచ్చే పత్రికలన్నీ చదవాలి.

భాగస్వామిని అయి (Partner) తనతో టెన్నిసు ఆడాలి. నైపుణ్యంతో carrams ఆడాలి. చదరంగమాడి ఆటకట్టించాలి. విద్యాధికులూ నాగరికులూ అయిన తనస్నేహితుల్ని స్నేహితురాండ్రనీ పరిచితుల్ని చేస్తే వెర్రిఅనుమానాలుపడకుండా వాళ్లతోకలిసి ప్రవర్తించటం నేర్చుకోవాలి.

శౌర్యఅన్న విషయములో అతని అభిప్రాయములు యివి. ప్రేమకు ప్రతిఫలమైన పతిభక్తిఅంటే అతనికి గౌరవమే. లోకంకోసం పతిభక్తిఅంటే అసహ్యం. విజ్ఞానంలేని సౌందర్యానికి నాగరికతలేని పతిభక్తికీ అతనిదృష్టిలో విలువలేదు. ఈ రెండూ మూర్తీభవించిన సావిత్రి అతనిహృదయాన్ని ఆకర్షించదు.

అక్షరమాత్ర పరిజ్ఞానంగల సావిత్రి యీస్థితికి రావాలి. పాతాళంలోనించి గౌరీశంకర్ శిఖరమీదికి రెక్కలులేకుండా యెగరాలి. గజంలోతు చాటి పద్రలో కేదారఖండం సృష్టించాలి. పట్టుకుంటే పిండి రాలిపోయేశిలలతో తాజ్ మహాలు తయారుచెయ్యాలి.

కేవల స్వశక్తిమాత్ర సహాయ్యుడై మహాసామ్రాజ్యాన్ని కూలద్రోయ దలచుకున్న విప్లవకారుడి విజయానికి యెంతఅవకాశంవుందో అతని విజయానికీ అంతే అవకాశంవుంది.

అయినా ప్రభాకరరావు ఉత్సాహం విడువలేదు. ఎప్పటికైనా తనకు సుఖప్రణయానుభూతి అంటూ వుంటే అది సావిత్రి వివేకమ్మీద ఆధారపడివుంది.

352

సావిత్రికి మనుచరిత్రంపాఠం మొదలుపెట్టేడు. నడక చాలా మందంగావుంది. "ఉల్లమునందు నక్కటిక మూనుట" దగ్గరకువచ్చేటప్పటికి మూడువారాలుపట్టింది. ఆపద్యసారస్యము సావిత్రి మాటల్లోవున్న మృదువైన రెండు త్రిపాదుపు పెద్దన ప్రతిభ ఉగ్గడించుచూ రెండుగంటలు విమర్శకోపన్యాసం చేశాడు. వింత, భయం, ఖంగారూ నల్లగక్కే కేడికళ్లల్లో దృష్టినిలపెట్టి వినివిని సావిత్రి "మీచదువుకున్నవాళ్లదంతా రంకూ తమాషానూ! యీ కావ్యముక్కల్లో యింత వుందండీ!" అన్నది. ఆదెబ్బతో అతని ఉద్రేకం పంపు పూడదీసిన 'స్టౌవ్'లాగ ఆగిపోయింది. ఆనర్సుక్లాసు లెక్చరుహాలుకు యోగ్యమైన ఆ అమూల్యోపన్యాసం వ్యర్థం అయినందుకు ఒక్కవేడినిట్టూర్పువిడిచాడు. ఆవుపన్యాసం సుభార్గవముందు చేస్తే యెల్లా ఉండేది? రెక్కలు గట్టుకుని అతనితోపాటుగా అంతరిక్షంలోకి యెగసేది. అంత ప్రతిభావంతుడైన స్నేహితుని సంపాదించినందుకు గర్వపడేది. సంస్తుతివాక్య కుసుమహారాల్తో నింపివేసేది. శ్లాఘానురాగ పవిత్రములైన దృగ్వీచికల్లో స్నానంచేయించేది. ఇక్కడ ఆవుపన్యాసం బూడిదలో పోసిన పన్నీరయింది.

ప్రతిరోజూ యిల్లాంటిదే యేదోజరిగేది. ఆవిడ బెదిరేది. గుండెలుజారి అతను నిట్టూర్పులు విడిచేవాడు. మరి రెండుపద్యాల్తో మనుచరిత్రపాఠం ఆగిపోయింది.

కుంపటి ముందరబెట్టుకుని అవస్థపడుతూవుంటే స్టౌవ్ వెలిగించటం నేర్చుకోమని చాలా బాధపెట్టేడు. "దానికిటుకులు నాకుతెలియ"దని చాలారోజులు తలాయించింది. ఒకనాడు అతనే చాలా తీవ్రంగా చెప్పగా సాహసించి ఉద్యమించింది. ఎన్నడూ చూడని ఆపరేషను చేయబోయేముందు దుర్బలహృదయుడైన సర్జనులాగ కంపించింది. చివరకు స్పిరిట్ పోసి వెలిగించి పంపు బిగించకుండా గాలి కొట్టింది. స్పిరిట్ ఆరిపోయింది. స్టౌవ్ వెలగలేదు. "ఇదేమిటో తెలియటంలేదండీ," అని కేక పెట్టింది. చదువుతూవున్న సర్జరీ వదిలిపెట్టి వచ్చిచూసి పంపు బిగించాలని చెప్పి వెళ్లేడు. మళ్లీ స్పిరిట్ పోసి సరిగా కాలకుండా గబగబా గాలి కొట్టింది. భగ్గుమని మంటలేచింది. ఏంచెయ్యాలో తెలియక "బాబోయ్!" అని బయటకువచ్చింది. అతను వెళ్లి ఆర్పేడు. మర్నాడు పీడనశక్తిమీద, వాతావరణంమీద, స్టౌవర్కింగుమీద స్కూలుమేష్టరు చెప్పినట్లుగా చెప్పేడు. **Principle should precede application** అనుకొని అంతా విని నాకీ స్టౌ వద్దూ చట్టుబండలూ వద్దు కష్టపడేదాన్ని నేనయితే మీకేం అన్నది. స్టౌ మూలపడింది అంతటితో.

హోటలునుంచి అన్నంతెచ్చే అయ్యరు మానివేశాడు. ప్రభాకరరావు ఆపనికి ఒక మొదలియారు కుర్రాణ్ణి పెట్టేడు. సావిత్రి "పెడితే బ్రాహ్మణ్ణి పెట్టండి లేకపోతే కావలసినవి పట్రండి నేనే వంటచేస్తా"నన్నది. ఏసంఘసంస్కర్త యివ్వని మహోపన్యాసం యిచ్చాడు. ఆవిడలోపరివర్తనం కలగలేదు. నెలకు మూడురూపాయిలుయిచ్చి ఒక అయ్యర్ని కుదిర్చాడు.

ఆవిడకి అందమయిన కళ్లజోడు కొనుక్కొచ్చేడు. "ఎందుకిది దండగ? నాకళ్లకేమి జబ్బులేదు. ఏజబ్బులేకుండా మీరు పెట్టుకున్నారు అదిచాల్లెండి" అని యెత్తిపొడిచింది.

కాళ్లకి చెంకీ చెక్కిన స్లిప్పర్లు కొనుక్కువచ్చేడు. ఎందుకన్నది. "ఇంట్లో తొడుక్కుంటానికి" అన్నాడు. "ఇంట్లో చెప్పులెందుకు? నే నేం దొరసాన్నేమిటి? డబ్బు తగలెయ్యటానికి కిదేముళ్లు" అని చివాట్లెట్టింది.

కాళ్ల కడియాలు తీసెయ్యమన్నాడు. కుంకం బొట్టు కొంచెంచిన్నదిగా పెట్టుకోమన్నాడు. బాడీసు తొడుక్కోమన్నాడు. నక్కపాపిడేనా తీసుకో

353

మన్నాడు. పారిపోయే యిద్దరు ముగ్గురిని ఉపమానంగా చూపించాడు.

చివరకి "ఏమిటండీ! యీ పోరు నాకు. ఈమాల కూడు చాలదుటండీ! ఈ భోగం వేషాలు నేను వేయ లేను. నన్ను చంపినా సరే!" నన్నది.

ప్రతివిషయంలోను ప్రభాకరరావుకు అసంతృప్తి కలిగింది. జీవితంలోంచి సౌందర్యం తీసివేయబడ్డట్లయింది. కిసలయితో ద్యానంలాగ శోభిల్ల వలసిన అతని తరుణహృదయం నైరాశ్యంతో ఘోర యెడారి అయిపోయింది.

అంతభావోద్రేకం గల తనకు యిటువంటి భార్యను చేసి తన్ను యింత సంగదీయటానికి భగవంతుడికి తానేమి అపకారం చేశానా అనుకునేవాడు.

నిజం విచారించితే సావిత్రి తప్పువున్నదేమి వుంది? ఆవిడ శైశవంనుంచీ పొందిన తర్ఫీదు పెరిగిన పరిసరములు ఆమెను అట్లా తయారుచేసినవి: జీవిత విధానంలో ఆవిడకీ తనకీ అభిప్రాయభేదం వుంది. అంతే! ఆవిడని నిర్బంధించి తన అభిప్రాయములను ఆవిడమీద Force చేయటానికి తనకున్నదేమి హక్కువుంది? అతను స్త్రీ జాత్యారాధకుల్లో అగ్రగణ్యుడు. ఇంత విసిగించినా సావిత్రిని ఒక్కమాట అయినా అనేవాడు కాదు. ఆవిడ యేదైనా అడిగితే వెంటనే తెచ్చియిచ్చేవాడు. అసలు ఆవిడ కోరికలేమున్నాయి? శనివారంనాడు ఆంజనేయస్వామికి కొబ్బరికాయ తెమ్మనడంతప్ప! ఆవిడ అడిగిందేలేదు. అన్నీ అతనే వూహించి తెచ్చేవాడు.

తనకు కావలసిన భార్యను ఆవిడలో చూడలేను అని తేలిపోయింది. అతనికి ఆవిడని నిర్బంధించటానికి అతనికి చేతకాదు. అతను ఆత్మవున్న భర్త. అమాయిక అయిన కన్య కళ్లనీరు అతన్ని ఉడికించి వేస్తుంది.

గృహంలో సౌఖ్యం, శాంతివుండాలంటే భార్యాభర్తలు సమానప్రేమలూ సమాన జీవితాదర్శాలు కావాలి. దంపతులప్రేమ వారి మనస్సుల కలయిక మీద ఆధారపడుతుంది. అభిరుచులు వేరయితే అనురాగానికి చోటువుండదు.

అతడు పాశ్చాత్య నాగరికతా వ్యామోహితుడు. తను రోజల్లా కాలేజీలోపడి యింటికి రాంగానే Hullow! అని ఆహ్వానించేవారూ అందంగా అలంకరించుకున్నప్పుడు అతని taste ని మెచ్చుకుండేవారు సినిమాలకీ బీచికీ వెళ్లినప్పుడు అందమయిన వేషంతో ఆకర్షణీయమైన భంగితో ప్రక్కనవుండి కబుర్లు చెబుతూ చూశేవాళ్లందరూ యీర్ష్యపడేటట్లు చేశే వాళ్లూ కావాలతనికి. ఆవిధంగా అనేకచోట్ల తన కంటబడే యువతీ యువకుల్ని చూస్తే హృదయం నీరయ్యేది అతనికి. కాలం గడిచింది.

iii

ఒకనాడు ప్రభాకరరావు గదిలో కూచుని కాలేజి గ్రూపుఫోటోలో శివిగా కూర్చునివున్న సుధామయ వంక చూస్తున్నాడు. మెదడు అడుకత్తి పరిసరము లను మరిచింది.

ఎందుకో అక్కడికి సావిత్రి వచ్చింది. మెల్లిగా అతని వెనకాలనుంచుని "ఎవరండీ ఆ అమ్మాయి?" అంది.

కొరడాదెబ్బ తగిలినట్లయింది ప్రభాకరరావుకు—కాని తెప్పిరిల్లి "ఏమ్మాయి?" అన్నాడు.

"మీరుచూస్తున్న అమ్మాయి"

"అమ్మాయిలు అను, యిక్కడ చాలామంది ఉన్నారు."

అందర్నీ మీరు చూట్టంలేదు. అమ్మాయినే మీరు చూస్తున్నారు. ఎవరండీ ఆ అమ్మాయి?"

"ఎవరో చదువుకునే అమ్మాయి."

"ఎవరో చదువుకునే అమ్మాయి! అయితే అమ్మాయివంకే ఎందుకు చూడటం?"

ప్రభాకరరావు మాట్లాడలేకపోయినాడు. అతని శరీరమును యింద్రియములను సావిత్రి వివాహవేళలో కొనుక్కుంది. వాటిని అన్యవిషయంలో వినియోగించటానికి అతనికి యేమి హక్కువుంది?

"పోనీండి చెప్పకపోతే!" అని వెళ్లిపోయింది సావిత్రి, భర్త యెంతకూ జవాబుచెప్పక పోవటం చూసి.

"ఎవరండీ ఆ అమ్మాయి?" ఆ ప్రశ్నే అతని చెవుల్లో ప్రతిధ్వనించింది. ఏమిటి దానికి జవాబు?

ఆ సాయంత్రం ప్రభాకరరావు యెందుకో మనీ పర్సు బల్లమీద వదలి వెళ్లేడు. పరధ్యానంగా సావిత్రి అందులో యేముందోనని ప్రతి అర వెదికిచూచింది. కొంతడబ్బుతో పాటు ఒక అరలో యేదో బంగారం లాగా మెరిసింది. బంగారానికీ పల్లెటూరిపిల్లకీ అవిభేద్యమైన సంబంధం వుంది. అది కాసేమోనని బయటికిదీసి చూసింది సావిత్రి.

అది ఒకలాకెట్టు అందులో సుధార్ణవ బొమ్మ వుంది. ఆ బొమ్మకీ యిందాక తన భర్త చూస్తూవున్న బొమ్మకూవున్న పోలిక చూస్తే సావిత్రికి ఖంగారు పుట్టింది. "ఇదంతా యేమిటో గోలగావుంది. రానీ అడుగుతాను" అనుకుంది.

ఆ సాయంత్రం ప్రభాకరరావు డాబామీద వెన్నెట్లో పడుకున్నాడు ఏదో ఆలోచించుతూ. వెనకాలనుంచివచ్చి సావిత్రి "యిదియేమిటండీ" అన్నది. దొంగ మేజస్ట్రేటుముందులాగా ఒణికిపోయినాడు ప్రభాకరరావు సావిత్రిముందు, కాని "ఏమిలేదు. అది నీకెల్లా దొరికింది?" అన్నాడు ఎల్లాగో మింగవాడు గనక.

"ఇంతకీ యెవరో చెప్పమంటే చెప్పరు. ఎవరండీ ఆ అమ్మాయి?"

ఆ కంఠంలోవున్న అమాయకత్వం, దొంగసాక్ష్యం యిచ్చే సాక్షిని వకీలు సింహగర్జనలాగా అతన్ని కంపింప జేసింది. కాని మళ్లీ తెప్పిరిల్లి "ఒకస్నేహితురాలు" అన్నాడు.

"స్నేహితుల బొమ్మలు యిల్లా దాచుకుంటారా?" అజ్ఞాన జీవితమైనా ఆనిష్కల్మషత యెంత పవిత్రమయింది.

"ఔను."

రెండు నిముషాలు అల్లాగే చూసింది సావిత్రి. ఆ చూపు నాయనమ్మలు చెప్పే వెర్రికథలు విశ్వసిస్తూ బాలకులుచూసే చూపులాగా వుంది.

"మరి మీబొమ్మ ఆ అమ్మాయిదగ్గిరా వుంటుందా?"

"ఆ ఉంటుంది" అతనికి నవ్వూ యేడుపూ రెండూ వచ్చినయి.

"ఆ అమ్మాయిని మనయింటికి ఒకమారూ తీసుకు రాలేదేం?"

అతను మాట్లాడలేదు. తన ప్రశ్న సంగతి మరచిపోయింది సావిత్రి.

"మరి మీబొమ్మ యిల్లా దగ్గిర వుంచుకుంటే వాళ్ల అమ్మా నాన్నా కోప్పడరండీ?"

"వాళ్ల అమ్మా నాన్న లేరు." అన్నాడు తేలిగ్గా.

"ఒకవేళ ఉంటే?"

"ఉన్నా కోప్పడరు". ఎన్ని అబద్ధాలు!

"కోప్పడరూ? ఏమి వింతండీ!"

ఆ వేళకి ఆ సంభాషణ అంతటితో అంతానికి వచ్చింది. ఆ మర్నాడు ప్రభాకరరావు బావమరది వచ్చి సావిత్రిని తీసుకువెళ్లేడు. ఆ విధ తమ్ముడి అన్నప్రాశనకు. పరీక్షలని వంక పెట్టి ప్రభాకరరావు తప్పించుకున్నాడు.

iv

ఏకాంతంగా వుండటంచేత ఫైనల్ యియరు పరీక్షకు విపరీతంగా చదివేడు ప్రభాకరరావు, అతనికి మెడిసిన్లోనూ సర్జరీలోనూ డిస్టింక్షను వచ్చింది. సుధార్ణవ మిడ్వైఫరీలో డిస్టింక్షను తెచ్చుకుంది.

ఇప్పుడు సుధార్ణవ డాక్టర్ సుధార్ణవ! ప్రభాకర రావు డాక్టర్ ప్రభాకరరావు!

ఫలితములు తెలిసిననాటి సాయంత్రం సుధార్ణవ హాస్టలుకు వెళ్లేడు ప్రభాకరరావు. ఆ రోజు ఆడవాళ్లల్లో అన్ని సంవత్సరాలవాళ్లూ విరివిగా పరీక్ష అయినారు. హాస్టలంతా కోలాహలంగావుంది. ఎక్కడో తప్ప వాచినకళ్లు కనబడటంలేదు.

అభ్యంగనపరిశుద్ధమైన దీర్ఘవేణిని కొంతవరకూ జడవేసి వదిలి, మల్లెపూవువంటి మస్లిను చీరకట్టుకుని మామిడిచెట్టుక్రింద కుర్చీమీద కూర్చునివుంది సుధార్ణవ. చిరుగాలికి ముంగురులు నాట్యంచేస్తూ వున్నవి. ఆవిడ కళ్లల్లో ఆలోచనా విజయోత్సాహం అసాధారణ విజయం కలిగినప్పుడు ఆడవాళ్ల కళ్లల్లో కనబడేదర్పం అన్నీ తాండవిస్తున్నవి.

దూరాన చెట్టుక్రింద యిద్దరు యువతీ యువకులు 'టెన్నిస్' ఆడుకుంటున్నారు, తనకు అభినందనములు చెప్పవచ్చిన సంపన్న స్నేహితుని కారుమీద కాలు వేసి విజయోపేత అయిన యువతీమణి ఒకర్తె ధన్యవాదములు చెబుతోంది. 'రకెట్ను' పట్టుకుని! ఛాన్సు కోసం నిరీక్షించుతూ, ఆడేవాళ్లు బాగా ఆడినప్పుడు హర్షము వెలిబుచ్చుతూ టెన్నిసు కోర్టుదగ్గర చాలా మంది నిరీక్షించుతున్నారు. ఎక్కడ చూసినా "Congratulations" "Thanks" అన్నమాటలు వినబడు తున్నవి. ఆరోజు లక్షమంది మిస్ మేయోల నోరు మూయించేటట్లుగా వుంది ఆ హాస్టలు.

సుధార్ణవ ప్రభాకరరావు పరస్పరము అభినందన ములు ధన్యవాదములు అందచేసుకున్నారు. అందరూ చుట్టిముట్టి అభినందనములు చెప్పేరు. అందరికీ ధన్య వాదములు అందచేసేటప్పటికి అరగంటసేపు పట్టింది.

"తలంతా యేదో దిమ్మగాఉంది ఎక్కడికన్నా షికారు పోదాము" అన్నది సుధార్ణవ. ఆవిడ చేసిన సూచనలకు వ్యతిరేకం అతను యింతవరకూ చెప్పలేదు.

ఇద్దరూ "స్పర్టాంకు మెడోస" వేపువెళ్లేరు మధ్య మధ్య మాట్లాడుకుంటూ.

మంద మనోజ్ఞమైన సాయంవాయువు వీస్తోంది. రేడియోలోనించి శ్రావ్యమైన సంగీతం వినబడుతోంది. ఆనందానికి విరుద్ధమైన దేదీ అక్కడలేదు.

కాని సుధార్ణవహృదయంలో చిన్నతుపాను రేగు తోంది. ఆవిడ తండ్రి ఆవిడకు చాలా ఆస్తి అప్పగించి పోయినాడు. అది ట్రస్టీలచేతుల్లోనుంచి కొద్దిరోజుల క్రిందే ఆవిడ చేతుల్లోకి వచ్చింది. ఇప్పుడు విద్యా పూర్తి అయి వైద్యవిద్యలో పట్టభద్ర అయింది ఎంతకూ ప్రభాకరరావు హృదయం విప్పారేటట్లు లేదు. ఆవిడప్రేమ యిక దాచటానికి వీలుగా నుండక పొంగి పొర్లిపోతోంది. సంతోషప్రదమైన యీదివ్య సమయంలోనే ఆ ప్రేమను రెండువు సఫ లీకృతం చేసుకోగూడదు?

కాని యువతులు సహజంగా దర్పస్వరూపలు. తమ ఉద్రేకాలు తమన్ని ఎంత బాధించు తున్నా అణచుకుని తాముప్రేమించిన యువకులు తమ పాదాక్రాంతులు అయ్యేవరకు నిరీక్షించుతారు, అంతేకాని బెట్టునీడి చేలలు కారు. కాని ఒక్కొ క్కప్పుడు యీదర్పాన్ని అణచుకొని తమంతట తామే బయటపడేదైర్యం కలుగుతుంది యువతికి. ఆ అవస్థకుముందు "లొంగిపోవటమేనా?" అన్న శంక, దాంతో ఒకతుపాను రేగుతుంది. సుధార్ణవ యిప్పుడీస్థితిలో ఉంది.

చివరకు నిర్ణయానికి వచ్చింది. తనహృదయానికీ, శరీరానికీ సంపత్తుకూ అన్నిటికీ అతన్ని అధినాథుణ్ణి చేయదలచుకుంది. ఇంకా రెండుకు బెట్టుసరికి మెల్లిగా తన ప్రేమసంగతీ ఇన్నాళ్లుగా తానునుభవించిన వేదన సంగతీ అంతా చెప్పింది. చివరకు తన్ని పత్నిగా స్వీకరించమని చెప్పింది. అబ్ధిగంభీర [illegible] సుధార్ణవ

356

ఆ సమయంలో బెట్టువిడిచి శిలయయి ఉద్రేకంతో ఆకంపించి పోయింది.

ఆవిడ నోటినుంచి వచ్చే ప్రతిఅక్షరం అతనిశరీరం లోని ప్రతిరక్తాణువునూ ఉడికించి వేసింది! క్షణకాలం అతని ఆత్మ వైకుంఠప్రాప్తిఅయిన విష్ణుభక్తుడిలాగ ఊహాతీతమైన ఆనందమును అనుభవించింది. కాని మరుక్షణమే సావిత్రిరూపం అతనికి కనులముందు కన బడింది.

చవిటిపర్రకోసం స్వర్గసామ్రాజ్యాధిపత్యం వొదులుకోవాలి ప్రభాకరుడు!! ఆసమయంలో ఆమెదడు లేడి, ఆనెత్తురుఉడుకు, ఆహృదయంలోవేదన ప్రపంచకంలో ఉన్నవాఙ్మయాలన్నీ కలిసినా అభివర్ణించలేవు.

ఇప్పుడు ఆనిష్కల్మష ప్రణయమూర్తికి యేమని జవాబుచెప్పాలి? ఆ ప్రేమని తిరస్కరించుతాడా? ఏ కారణంచేత? స్వీకరించుతాడా? ఏ మార్గంలో? ఎంతప్రయత్నించినా అతని నాలుక కదలలేదు.

తన మహాపరాధం సుభార్గవకు తెలిపి ఆవిడ క్షమాభిక్ష కోరదామనుకున్నాడు. అనిర్వచనీయమైన యేదో దౌర్బల్యం అతన్ని శక్తిహీనుణ్ణి చేసింది. ఆ దివ్యమూర్తిముందు అతను దోషాంగీకారం చేయలేకపోయినాడు. ఆత్మకు వ్యతిరేకమైన పరిపాలనావిధానమును పరిస్థితుల నిర్బంధంచేత అవలంబించి జాతి హింసచేసే విదేశాంగ మంత్రిలాగు అతను వేదన అనుభవించాడు.

కొంతసేపటికి అతనివాక్కు అతని స్వాధీనతకు వచ్చింది.

"సుధా! యీదీనుణ్ణి నీవంటి యువతి తన అమూల్యప్రేమతో పవిత్రీకరించటం చాలా అసాధారణమయిన విషయం. ఏ అభ్యంతరమూ చెప్పక 'ధన్యోస్మి' అనుకుని తలఊపవలసిన పరిస్థితులు నావి. కాని..." అపూర్వమైన హృదయవేదన యేదో అతనికంఠము రుద్ధము చేసింది. మళ్లీ విశ్వప్రయత్నం మీదమాట స్వాధీనమునకు తెచ్చుకున్నాడు. "కాని నేను వెంటనే యీప్రేమరాశిని స్వీకరించలేను. అందుకు నాశక్తికి మించిన అభ్యంతరములు ఉన్నవి. నా అంగీకారము యిచ్చేముందు కొన్ని విషమసమస్యలను పూర్తిచేయాలి. అందుకు కొన్నిరోజులైనా అవసరం." అన్నాడు.

తన ప్రభాకరరావునోటివెంట అటువంటి జవాబు వస్తుందని ఎప్పుడూ సుభార్గవ అనుకోలేదు క్షణకాలం ఆవిడ చైతన్యం ఆవిడను విడిచింది. తనకళ్ల మీద చెవులమీద ఆవిడకు విశ్వాసంపోయింది. అతను యుక్తవయస్కుడు. స్వతంత్రుడు. అతనికి అంగీకారం వెలిబుచ్చటానికి యేమిటి అభ్యంతరం?

"నీకేమిటి సందేహం? నిన్ను యెదుర్కొనే ఆ సమస్యలు యేమిటి?" అన్నప్రశ్నలు ఆవిడ నాలుకదాకా వచ్చినవి, కాని ఆవిడ వివేకం ఆవిడను వారించింది. అవిచ్ఛిన్నంగా ప్రవహించవలసిన ఆవిడ ప్రేమవాహినికి యిప్పుడు అడ్డుతగిలింది. ప్రభాకర ప్రణయలబ్ధి సందేహాస్పదం అవటంతోటే ప్రపంచకం అంతా ఖాళీగా తోచింది చివరకు.

"పోనీ! యింకా కొంతకాలందాకా ఆశ ధరించవచ్చునుగా,"

"నిస్సంశయంగా" అన్నాడు ప్రభాకరరావు.

ఆ తరవాత యేమీ సంభాషణ జరగలేదు. సంజ చీకటివారిని గృహోన్ముఖులను చేసింది. హాస్టలుగేటు దగ్గరమాత్రం 'గుడ్ నైట్' అన్నాడు ప్రభాకరరావు. 'గుడ్ నైట్' అన్నది సుభార్గవ, కాని ఆ కంఠంలో పూర్వంవుండే ఆప్యాయత లేదు. ఉత్సాహంలేదు. ఆవిడ కంఠదైన్యం కలిగించావనే తలపు ప్రభాకరరావును రంపపుకోత కోసింది. ఆకాశమున మెలిక నవ్వులు నవ్వే చంద్రుణ్ణి పెద్దకారుమబ్బు క్రమ్మివేసింది. ప్రభాకరరావు యింటికివెళ్లేడు. సావిత్రి యింట్లో

లేకపోవటం మహాదృష్టం అనుకున్నాడు. మూల అయ్యరు తెచ్చిపెట్టిన టిఫిన్ కాకీయరు చీమలుపట్టి పోతోంది. ఆ వివశత్వంలో ఆకలి యేం తెలుస్తుంది? అతను ఆలోచన మొదలుపెట్టేడు. ఇప్పుడు అతనికి విశాలప్రపంచంలో యిద్దరు వ్యక్తులుమాత్రమే కనబడుతున్నారు వారిమీదే అతని ఆలోచనలు కేంద్రీకరించి ఉన్నవి. వారిద్దరూ సావిత్రీసుభార్గవలు ఇద్దరూ తనదౌర్బల్యంచేతే తన జీవితంలోకి ప్రవేశించారు. ఒకరియందు తను భర్తృవిధిని నిర్వర్తించాలి. ఇంకొకరియందు ప్రణయవిధిని నిర్వర్తించాలి.

రాజ్యంకోసం ఆత్మీయులను వధించుటనో, ఆత్మీయులకోసం రాజ్యాన్ని విసర్జించుటమో తెలియక కర్తవ్యమూఢుడైన అర్జునునిలాగు, దోషిరాలైన తల్లిని చంపి తండ్రిదెబ్బల విధినిర్వర్తించుటమో తల్లిమీద ప్రేమతో తండ్రికి అపరాధం చేయుటకో తేల్చుకో లేక మనోవేదన చెందిన హామ్లెట్ లాగ అతను అవస్థపడ్డాడు.

ప్రతియుగంలో ప్రతిదేశంలో విధికీ ప్రేమకీ యుద్ధం జరుగుతూనేవుంది. ఆవిషమపరిస్థితుల్లో సరియైన కర్తవ్య నిర్ణయం చేసుకొన్న బుద్ధిమంతులు చాలా అరుదు. సావిత్రీ, సుభార్గవా: విధీ, ప్రేమా— రెండూ రెండే. వివేకమనే త్రాసులోపెట్టి యిద్దర్నీ యెంతసేపు తూచినా త్రాసు అటూయిటూ మొగ్గటం లేదు. ఒకరు ఉండగా మరొకరు లభించరు. ఇద్దరూ అసలు లభించరు.

శీలం విషయంలో సావిత్రి తులశిమొగ్గవంటిది. తన అభిప్రాయములతో యేకీభవించని మాత్రాన ఆమెను విసర్జించటానికి అతని ఆత్మ అంగీకరించదు. కావలిస్తే సుభార్గవనే తిరస్కరించవచ్చు; కాని ప్రపంచకములు మునిగినా అతనినాలుక ఆమాట ఉచ్చరించలేదు.

ఉంటే యిద్దరూఉండాలి. లేకపోతే యిద్దరూ ఉండకూడదు. లేకంటే దేవతుల్యుడుగా పరిగణించుతున్న సుభార్గవదృష్టిలో దోషిగా పరిగణింపబడి, ఆమెను ఆశాభంగంతో కృశింపుతూనో, అన్యగృహీతరాలై సుఖించుతోనో ఉంటే తను చూస్తూ జీవించలేడు. అది అసంభవము.

ఈ సిద్ధాంత పూర్వపక్షములతో మెదడు వేడెక్కి పోయింది. హృద్వేగం యినుమడించింది. రక్తనాళాలు చిన్నవి పెద్దకాజొచ్చినవి.

ఈ గోల అంతా తనే ప్రపంచకాన్ని విడిస్తేనే తప్ప తీరేటట్లు లేదు. అవివేకసంజనితమైన మానసికోన్మాదంలో అతని ఆత్మ ఆత్మహత్యను నిర్ణయం చేసింది.

* * *

మర్నాడు పదిగంటలకు అతని అకాల దుర్మరణం ప్రపంచకానికి తెలిసింది. అతనిశవం వైద్యాలయానికి వచ్చింది. విచారణమీద తేలిన నిర్ణయం విద్యుద్ఘాతంతో మరణం అని.

అతని విజ్ఞానం ఉన్నతవిద్య అన్నీ అనవసరంగా ఆత్మహత్య చేసుకొంటానికి వచ్చినవి.

కర్తవ్యతామూఢుడైన అర్జునుడికి శ్రీకృష్ణుడు కర్తవ్యోపదేశం చేసి ఉద్ధరించేడు. కర్తవ్యోపదేశం చేసేవాడు లేక హామ్లెట్ నశించాడు. ప్రభాకరరావు సున్నితస్వభావం తీవ్ర సమస్యలను యెదురుకోలేదు. బిగించిఉన్న వీణతీగె మోటుగా మీటినప్పుడు తెగినట్లు అతని జీవితం తెగిపోయింది. ఆవిషమ సమస్యలో అతనిబుద్ధికి మరొక్కబుద్ధి తోడైఉంటే ఆ మహావిప్లవం సంభవించేదికాదు.

ఒకవేళ సుభార్గవ అతన్ని క్షమించేదేమో! తన భర్త ఆనందంకోసం, సరీగ్గాబోధించితే, తనహక్కును సావిత్రిత్యాగం చేసేదేమో! అతను ధైర్యంతో ముందంజ వేయలేదు. హృదయదౌర్బల్యసంజనితమైన మానసికాందోళనలో ఉక్కిరిబిక్కిరి అయి ఊపిరిఆడక అతను నశించి పోయినాడు.

అతని మరణానికి కారకులెవరు? అతని భావాభిరుచులను నిర్లక్ష్యంచేసి నిర్బంధించి అతని జీవితాన్ని పాడుచేసిన సంరక్షకులు, ఇతరుల ఆదర్శములను లెక్కచేయకుండా తమ మూఢవిశ్వాసములకే వారినీ అవలంబించమనే ఛాందసులు. అతన్ని నిర్బంధించి అతని పినతండ్రి వివాహం చేయకపోయినా, అతని ముద్దు చెల్లించి మామగారు శైశవంలోనే సావిత్రికి విద్యాభిరుచి కలిగించి విజ్ఞానసంపన్నను చేసినా, సావిత్రి తన మూఢాచారములను విసర్జించి తనభర్తకు సంతోషప్రదమైన జీవితవిధానమును అవలంబించినా అతని ఆత్మహత్య సంభవించిఉండేదికాదు. కాని దైవవిధి అనుల్లంఘనీయం.

ఆ దుర్వార్త విన్నప్పుడు సుభాషిణి హృద్వేదనను ఏకలం అభివర్ణించుతుంది? అవిద జీవితాంతం బ్రహ్మచారిణిగానే ఉండిపోయింది.

ఏ కారణము లేకుండా యెందుకు తనను విడిచిపెట్టి భర్త వశించినాడో సావిత్రికి జన్మంతా ఆలోచించినా తోచలేదు. మూఢాచార సేవకుడైన తండ్రి సంఘభయంతో సావిత్రి జన్మాంతవైధవ్యం అనుభవించింది.

ప్రణయరంగంలో ఆశాభంగాలతో ఆత్మహత్యలు నేడు దైనిక సంఘటనములైనవి. హృద్విదారకములైన యీ విషాదసంఘటనములనుంచి హిందూ సంఘానికి యెప్పుడో ముక్తి?

## "శిశిరము"

("షెల్లీ" గీతములనుండి)

కోడకానిఁగోల్పడిన శకుంతమొండు
మోడు శాఖకఁ రెక్కలముడిచి, యొదిగి,
వెతనినాదించు ప్రేమైక విరహగీతి
కూసెఁ హృదయమే కలఁగ 'కూ! కూ!'
యటంచు.

ఊర్పుపై యూర్పు విడకఁ బిట్టూర్చి ప్రాకెఁ
యుగముక్రమ్మిన మందసమీరవీచి;
వృక్షపాదమ్మునాని స్రవించెమెల్ల
గా నొకండు లహరి మంచుగడ్డ కట్టి!

కాననాంతరసీమలో కానరాదు
చెప్పుకొన నొక్క పత్రంపు చిహ్నమైన!
చిత్ర మదియేమొగాని? సజీవసుమన
సమ్మె స్వప్నించ బోదిలాస్థలిని నేడు!

స్తబ్ధతా నిబిడీకృతశాంతిపొదలు
నాకసమున యెల్లదెసలయందుకూడ!
అతిప్రగాఢ ప్రశాంతిని శాంతసమయ
మును విదల్చుఁ "మరల" చక్రపునినదమ్మొ!

'కోమట్రాజు'



361